జానకి మనసు మహామండిపోతోంది. దానికి కారణం అన్నా,వదిన తనను పిలవకుండానే సినిమాకు వెళ్లడం. పెళ్లి కాకముందు అన్నయ్య తనంటే ఎంత ప్రేమగా ఉండేవాడు. తను లేకుండా ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. ఆఫీసు నుంచి రాగానే తనకు ఎన్ని కబుర్లు చెప్పేవాడు. కానీ ఇప్పుడో జానకి అనే ఒక చెల్లెలు తనకు ఉందని కూడా గుర్తులేదు కాబోలు అనుకుంది ఉక్రోషంగా.

నిజానికి అన్న పెళ్లి అయి వదిన వచ్చిన తరువాత ఇంటిలో అంతో ఇంతో మార్పు వచ్చింది. అందరి ముఖాల్లో ఇదివరకటి సంతోషం లేదు. ఇదివరలో పెళ్లికాకముందు అన్నయ్య జోక్స్ వేసి అందర్నీ నవ్విస్తూంటే వాడు. ఇప్పుడు ఆఫీసు నుండి ఇంటికి రాగానే నేరుగా బెడ్‌రూంలోకి వెళ్లడం. మరలా బాత్‌



# తనదాకావస్తే గానీ...

-పి.హేమలతాకుమారి

రూంలోకి వెళ్లడం..భోజనానికి మాత్రమే బయటకు రావడం. తనతో కూడా ముక్తసరిగా మాట్లాడుతున్నాడు అంతే. వదిన అయితే తన అవసరాలకు మినహా బయటకు రానేరాదు. ఇటు పుల్ల తీసి అటు పెట్టదు. అస్తమానం ఇద్దరికి ఏం కబుర్లు ఉంటాయి బాబూ? పెళ్లికాకముందు అన్నయ్య జీతం తెచ్చి నాన్నగారికి ఇచ్చేవాడు. ఇప్పుడో ఇద్దరి ఖర్చులకు ఇంత అని ఇస్తున్నాడు...ఇదేమైనా హోటలా?...అదే నేను కోడలిని అయితేనా...

* * *

"జానకీ! అప్సరలో మంచి సినిమా వచ్చింది. బయలుదేరు! శాంతా నువ్వు కూడా.." ఆఫీసు నుంచి వస్తూనే హడావుడిగా కేకలేశాడు శేఖర్.

జానకికి ఈమధ్యనే శేఖర్‌తో పెళ్లి అయింది. కొత్తగా అత్తవారింటికి వచ్చింది. "ఆవిడెందుకు మనతో?" అంది దీర్ఘంతీస్తూ.

అక్కడే ఉన్న శేఖర్ చెల్లెలు శాంత చిన్నబుచ్చుకుంది. అది గమనించినా గమనించనట్టుంది జానకి.

"ఎందుకేమిటి? సినిమాకు"

"అక్కర్లేదు. మనమధ్యలో పానకంలో పుడకలా ఆవిడెందుకు....నాకు ఇష్టం లేదు" అంది జానకి ఖచ్చితంగా.

భార్యభర్తలు ఇద్దరూ ప్రయాణమయ్యారు.

* * *

"ఈరోజు జీతాలొచ్చాయనుకుంటా"

"అవునూ"

"ఏదీ"

"నీకెందుకు? నాన్నగారికి ఇస్తాను"

"ఇకనుండి అలా జరగడానికి వీల్లేదు"

"ఏం?"

"మనిద్దరిఖర్చుకు ఇంత అని ఈయండి. మిగిలినది మన భవిష్యత్తుకు దాచుకుందాం" స్థిరంగా అంది జానకి.

ఏం అనలేకపోయాడు శేఖర్.

ఆ సమయంలో జానకికి తమ ఇంటికి వదిన వచ్చిన కొత్తలో తను పడిన మానసికక్షోభ గుర్తుకురాలేదు.

★